క్లుప్తంగా

వైభవంగా సత్యదేవుడి వ్రతాలు

లింగపాలెం: రెండో అన్నవరంగా ప్రసిద్ధి చెందిన లింగపాలెం మండలం రంగాపురంలోని శ్రీ సత్యనారాయణస్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా శుక్రవారం పెద్ద సంఖ్య వ్రతాలు నిర్వహించారు. ఈ ఆలయానికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ప్రతి కార్తీక మాసంలోనూ పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి సత్యదేవుడి వ్రతాలు చేస్తుంటారు. ఈ మేరకు భక్తులకు ఆలయ గుమస్తా గోపి తగిన ఏర్పాట్లు సదుపాయాలను కల్పించారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం



సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ప్రజా ప్రతినిధులు

కొయ్యలగూడెం: బయ్యనగూడెం పంచాయతీ పరిధిలో శుక్రవారం చేపట్టిన అభివృద్ధి పనులను వైస్ ఎంపీపీ తుమ్మలపల్లి గంగరాజు ప్రారంభించారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన నిధులతో పాటు, నూతనంగా మంజూరు కాబడిన రూ.20 లక్షల నిధులతో చేపట్టిన పనులను ఉప సర్పంచ్ కోరుకొండలో ఆధ్వర్యంలో ప్రారంభించారు. సీసీ రోడ్లు అదే విధంగా డ్రెయిన్లు, కల్వర్టులు పంచాయతీ కార్యాలయం వద్ద నూతనంగా షెడ్డు నిర్మాణపనులు మంజూరు కాబడిన నిధులతో నిర్మిస్తామని సర్పంచ్ లింగిశెట్టి అనంతలక్ష్మి తెలిపారు.నక్కా లక్ష్మీప్రసన్న, తోట విజయలక్ష్మి, తలారి నాగు, బాలం సూర్యనారాయణ, కొండా లక్ష్మి, మద్దిపాటి శ్రీను, ఉక్కుర్తి నీలయ్య, తదితరులు పాల్గొన్నారు.

తోటలకు పంటల బీమా

కొయ్యలగూడెం: మామిడి, జీడి మామిడి తోటలకు సంబంధించి వాతావరణ ఆధారిత పంట భీమా సౌకర్యాన్ని రైతులు వినియోగించుకోవాలని ఉద్యాన శాఖ అధికారి ధీరజ్ లక్ష్మణ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా ఉద్యాన అధికారి డాక్టర్ ఎస్ రామ్మోహన్ ఆదేశాల మేరకు రైతులకు ఈ అవకాశం కల్పిస్తున్నామన్నారు. జిల్లాలో సుమారు 36వేల ఎకరాల మామిడి పంట సాగులో ఉందన్నారు. ప్రతి ఏడాది మామిడికి ప్రతికూల వాతావరణ పరిస్థితుల వలన రైతులు ఎక్కువగా నష్టపోతున్నారని, రైతులను ఆదుకోవడం కోసం మొట్ట మొదటిసారిగా మామిడి పంటకు ప్రభుత్వం వాతావరణ ఆధారిత పంట భీమాను కల్పిస్తుందన్నారు. పట్టాదారు పాసుపుస్తకం లేదా 1బీ పత్రం, ఆధార్ నకలు, బ్యాంకు ఖాతా పుస్తకం మొదటి పేజీ నకలు, పంట నిర్ధారణ ధృవీకరణ పత్రం రైతులు సమర్పించాలన్నారు.

అనాథ పిల్లలకు సాయం

కుక్కునూరు: శ్లోక పాఠశాల విద్యార్థులు శుక్రవారం అమ్మ ప్రేమ అనాథ శరణాలయానికి తమ వంతు సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా శ్లోక స్కూల్ కరెస్పాండెంట్ మాదినేని శ్రీనివాస్ మాట్లాడుతూ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు తమ వంతు సాయంగా 3 క్వింటాళ్ల బియ్యం, 50 కేజీల కందిపప్పు, 20 ప్లేట్లు, 100 జతల బట్టలు, నోట్‌బుక్స్‌అందించినట్లు చెప్పారు.

మహాగర్జనను విజయవంతం చేయండి

చింతలపూడి: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ డిసెంబర్ 15న అమరావతిలో జరిగే మాలల మహాగర్జన సభను విజయవంతం చేయాలని అఖిల భారత మాల సంఘాల జేఏసీ చైర్మన్ డాక్టర్ ఉప్పులేటి. దేవి ప్రసాద్ పిలుపునిచ్చారు. ఏలూరు జిల్లా చింతలపూడి పట్టణంలో శుక్రవారం వీకేఎం ఫంక్షన్ హాల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో దేవి ప్రసాద్ మాట్లాడుతూ పశ్చిమగోదావరి జిల్లాలో ఏడు లక్షల 50 వేలు మంది మాలలు ఉంటే రిజర్వేషన్ ఉన్న స్థానాల్లో ఒక్క సీటు కూడా ఇవ్వకపోవడం మాలల పట్ల చంద్రబాబుకు ఉన్న చిత్తశుద్ధి అర్థమవుతుందన్నారు. 2014లో ఎస్సీ వర్గీకరణకు మద్దతు ఇచ్చి, చంద్రబాబు చేసిన తప్పుడు పని వల్ల మాలలు విద్య, ఉద్యోగ రీత్యా తీవ్రంగా నష్ట పోయే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణకు చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను తిప్పుకొట్టేందుకు మాల సంఘాలన్నీ ఐక్యంగా మాలల జేఏసీగా ఏర్పడి ప్రభుత్వ వైఖరికి నిరసన తెలియజేసేందుకు డిసెంబర్ 15వ తేదీన చలో అమరావతికి పిలుపునిచ్చామన్నారు. మెండెం సంతోష్‌కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు పంతగాని రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

చింతలపూడి: ప్రజా సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నేతలు ప్రభుత్వాన్ని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను మోసం చేస్తున్నాయని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు డీఎన్‌వీడీ ప్రసాద్ ఆరోపించారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం నిర్వాసితులకు ఎకరాకు రూ.40 లక్షల నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: కూటమి ప్రభుత్వ విద్యుత్ విధానాన్ని వ్యతిరేకిస్తూ సీపీఎం శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టింది. పాలనలోకి వచ్చి ఆరు నెలలు గడవకుండానే రూ.17,898 కోట్ల మేర విద్యుత్ సర్దుబాటు చార్జీల భారం జనం నెత్తిన వేసిందని సీపీఎం మండల కన్వీనర్ శుక్లబోయిన రాంబాబు పేర్కొన్నారు.

రైతులకు శాపంగా గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం

- పంట పొలాలను కాపాడండి
- పుట్లగట్లగూడెం రైతుల వేడుకోలు

జంగారెడ్డిగూడెం: గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం కారణంగా పంట పొలాలను నీరు ముంచెత్తుతుండటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరుగాలం పండించిన పంట చేతికి వస్తుందా లేదా అని ఆయోమయంలో ఉన్నారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం తమకు శాపంగా మారుతుందని రైతులు ఆందోళన దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి.

మండలంలోని గుర్వాయిగూడెం , పుట్లగట్లగూడెం గ్రామాల మధ్యలో గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం జరుగుతుంది. ఇదే గ్రామాల మధ్య ఉన్న కొంగల చెరువు పరిధిలో సుమారు 500 ఎకరాల ఆయకట్టు ఉంది. హైవే నిర్మాణంలో భాగంగా వర్షపునీరు బయటకు పోయేందుకు వీలుగా రోడ్డుకిరువైపులా డ్రెయిన్లు నిర్మించారు. అయితే ఈ డ్రెయిన్ల ద్వారా వచ్చే నీరంతా కొంగల చెరువు ఆయకట్టులోని పొలాలను ముంచెత్తుంది. దీనికి తోడు పుట్లగట్లగూడెం గ్రామంలోని మురుగునీరు సైతం పొలాలల్లోకి చేరుతుంది. వాస్తవానికి కొంగల చెరువు నీరు పంట కాలువల ద్వారా దిగువకు వెళుతోంది. రైతులు పంట కాలువల ద్వారా తమకు అవసరమైన సాగు నీరును వినియోగించుంటకున్నారు. చెరువుకు సంబంధించిన క్రస్ట్ గేటును అవసరమైనప్పుడు తెరిచి, అవసరం లేనప్పుడు మూసివేస్తారు. అయితే గ్రీన్‌ఫీల్డ్ హైవే నుంచి వచ్చే నీరు పంట కాలువల్లో కలుస్తుండటతో ఆ నీరు పంట చేలను ముచ్చెతుంది. ప్రస్తుతం ఆయకట్టు పరిధిలో రైతులు వరి పంటను వేశారు. ఈ పంట ప్రస్తుతం కోత దశకు చేరుకుంది. వాస్తవానికి వరి కోతలు సమయంలో భూమి తడి లేకుండా ఉండాలి. అప్పుడే కోతకు వీలవుతుంది. ప్రస్తుతం నీరు ముంచెత్తడంతో పంట చేలు తడిగానే ఉంటున్నాయి. కూలీలతో గాని, యంత్రాలతో గాని కోతలు కోయించాలంటే సాధ్యం కాని పరిస్థితి ఏర్పడింది. దీంతో నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నీరు పోయేందుకు మార్గం లేక ముంపుకు గురవుతున్న పంట పొలాలు



పంట కాలువలోకి వెళుతున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే, పుట్లగట్లగూడెం డ్రెయిన్ వాటర్ →

అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు

సమస్యలను పలుమార్లు రైతులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. జంగారెడ్డిగూడెం ఆర్డీవో, ఇరిగేషన్ అధికారులు, గ్రీన్‌ఫీల్డ్ ప్రతినిధులు దృష్టికి తీసుకెళ్లారు. అయినా ఫలితం లేకుండా పోయింది. రైతుల వినతుల మేరకు హైవే ప్రతినిధులు తూరలు ఏర్పాటు చేసి కల్వర్టు నిర్మించినప్పటికీ నీరు పోయేందుకు మార్గం మాత్రం ఏర్పాటు చేయలేదు. దీంతో హైవేకు ఏర్పాటు చేసిన డ్రెయిన్ల ద్వారా వచ్చే నీరు. పుట్లగట్లగూడెం గ్రామం డ్రెయిన్ నీరు సైతం పంటలపై పడుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతులు సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరుతున్నారు.

పంట పొలాలు మునిగిపోతున్నాయి



గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం నేపథ్యంలో కొంగల చెరువు ఆయకట్టు భూములు ముంపుకు గురవుతున్నాయి. హైవే ఇరుపులా డ్రెయిన్లు నిర్మించారు. నీరు పోవడానికి మార్గం లేక ఆయకట్టు భూములపై పడుతుంది. వరి ఊడ్పుల నుంచి కోతలు కోసి పంటను బయటకు తీసుకువచ్చేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నాం. ఖర్చులు కూడా అధికమవుతున్నాయి. కొంగల చెరువు పరిధిలో నీరు తవ్వకాలువ ద్వారా బయటకు వెళ్లి లక్కవరంలోని తంగెళ్లకుంట చెరువు, రాచెరువు నిండి, మిగులు జలాలు ఎర్రకాలువలో కలిసేవి. తవ్వకాలువ ఆక్రమణకు గురైంది. ఇరిగేషన్, రెవెన్యూ, హైవే అధికారులు పంటలు మునిగిపోకుండా చర్యలు తీసుకోవాలి

– వామిశెట్టి హరిబాబు, రైతు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు, పుట్లగట్లగూడెం

సమస్యను పరిష్కరించాలి



కొంగల చెరువు ఆయకట్టులో సుమారు 600 మంది సన్నచిన్నకారు రైతులు 500 ఎకరాల వరకు సాగు చేస్తున్నారు. ఈ పంట పొలాలు గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం వలన మునిగిపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– పల్లి మధు, రైతు, పుట్లగట్లగూడెం

భోళా శంకరుడికి జ్వాలా తోరణం

- కనుల పండువగా జ్వాలాతోరణం
- భక్తులతో పోటెత్తిన శివాలయాలు

ద్వారకాతిరుమల: క్షేత్రపాలకునిగా విరాజిల్లుతోన్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వారి ఆలయంలో కార్తీకపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం రాత్రి జ్వాలాతోరణ మహోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. వరిగడ్డితో తయారు చేసిన తోరణాన్ని వెలిగించి, దాని కింద నుంచి శివదేవుడి వాహనానికి ప్రదక్షిణలు చేయించారు. భక్తుల శివ నామస్మరణలు, డోలు, సన్నాయి వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద ఘోషల నడుమ ఈ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

శివయ్యకు విశేష అభిషేకాలు

కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని క్షేత్ర పాలకుడి ఆలయంలో శుక్రవారం శివుడికి విశేష అభిషేకాలు నిర్వహించారు.

భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు

కుక్కునూరు: కార్తీకపౌర్ణమి సందర్భంగా శుక్రవారం మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయ అర్చకులు అమ్మవారికి అభిషేకం విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆకట్టుకున్న జ్వాలాతోరణం

కొయ్యలగూడెం: కార్తీక పౌర్ణమి నేపథ్యంలో జ్వాలా తోరణానికి (అగ్నితోరణం)ఎంతో విశిష్టత ఉంది. ఈ నేపథ్యంలో కన్నాపురం లోని శివాలయం వద్ద శుక్రవారం రాత్రి జ్వాలాతోరణ దేదీప్యమానప్రభ నిర్వహించారు. సుమారు పన్నెండు అడుగుల ఎత్తులో అగ్నితోరణాన్ని కట్టి ఆవు నెయ్యిని పోసి వెలిగించారు. అనంతరం శ్రీదుర్గా భవాని సమేత రసలింగేశ్వర స్వామి వారిని జ్వాల తోరణం నుంచి ఇరువైపులకు హరనామస్మరణతో ముమ్మార్లు రాకపోకలు నిర్వహించారు.



కొయ్యలగూడెం: పూజలు నిర్వహిస్తున్న భక్తులు



లింగపాలెం: విశేష అలంకరణలో స్వామి వారు

భక్తి శ్రద్ధలతో కార్తీక పౌర్ణమి వేడుకలు

కార్తీక పౌర్ణమి వేడుకలు శుక్రవారం మండల వ్యాప్తంగా ప్రజలు ఘనంగా నిర్వహించారు. కన్నాపురం శివాలయంలో 19వ తేదీ ఆరుద్ర నక్షత్రం రోజున విశేష పూజలు, 20వ తేదీ ఏకవారాభిషేకం ,లక్ష పత్రి పూజ, శాంతి కళ్యాణం రుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మట్టే శ్రీను తెలిపారు.

శివాలయాల్లో కార్తీక పౌర్ణమి శోభ

బుట్టాయగూడెం: కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజామునే పుణ్య స్నానాలు ఆచరించి శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. త్రిపుర సుందరీ సమేత కామేశ్వర స్వామివారి ఆలయం, కుమ్మరిగట్టు వద్ద ఉన్న శివాలయం, చింతలగూడెం, బెడదనూరు సమీపంలో ఉన్న శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే రాత్రి 365 కార్తీక దీపాలను వెలిగించి మహిళలు పూజలు చేశారు.

ధర్మాజీగూడెం శివాలయంలో

లింగపాలెం: కార్తీక మాసంను పురస్కరించుకుని కార్తీక పౌర్ణమి సందర్భంగా లింగపాలెం మండలంలోని ధర్మాజీగూడెం, ఆశన్నగూడెం, బాదరాల, రంగాపురం శివాలయాల్లో శుక్రవారం భక్తులతో కిటకిటలాడాయి. ధర్మాజీగూడెం శివాలయంలో ఆలయప్రధాన అర్చకులు అయిలూరి ఈశ్వర ప్రసాద్ భక్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కార్తీక పౌర్ణమి ప్రత్యేక పూజలు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం పట్టణంలోని ఆలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. కార్తీక మాసం రెండో శుక్రవారం, కార్తీక పౌర్ణమి కావడంతో శివాలయాలు, విష్ణాలయాలతో పాటు అమ్మవారి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. పట్టణంలోని ప్రధాన శివాలయాలైన బైనేరు ఉమాసహిత రామలింగేశ్వరస్వామి, పేరంపేట శ్రీరాజరాజేశ్వరస్వామి, జెడ్పీహైస్కూల్ వద్ద ఉన్న శివాలయంలో, గుహాలయలోని ఓంకారేశ్వరస్వామితో పాటు, పట్టణంలోని నూకాలమ్మ, ముత్యాలమ్మ, విజయదుర్గమ్మ, లలితాదేవి ఆలయాల్లోని శివలింగాలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

బౌద్ధారాముల వద్ద భక్తుల సందడి

మండలంలోని గుంటుపల్లి బౌద్ధారామాల వద్ద శుక్రవారం భక్తుల సందడి నెలకొంది. కార్తిక పౌర్ణమి సందర్భంగా బౌద్ధారామములో ధర్మ లింగేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పోలవరంలో

పోలవరం రూరల్: అఖండ గోదావరి నదీ మధ్య గల పోలవరం మండలం పట్టిసం శివక్షేత్రం కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులతో కళకళలాడింది. శివ నామ స్మరణతో మారుమ్రోగింది.

వీరేశ్వరస్వామికి లక్షపత్రిపూజ:

శ్రీ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామికి పోలవరం గ్రామానికి చెందిన పెంటపాటి పుల్లారావు కుటుంబ సభ్యులు లక్షపత్రి పూజా కార్యక్రమం నిర్వహించారు.

గోదావరి మాతకు హారతి:

పట్టిసం రేవులో గోదావరి మాతకు పూజలు నిర్వహించి హారతి ఇచ్చారు. అనంతరం పట్టిసం గ్రామంలో జ్వాలా తోరణం కార్యక్రమం నిర్వహించారు.



ద్వారకాతిరుమల: జ్వాలాతోరణాన్ని వెలిగిస్తున్న ఆలయ ఈఓ మూర్తి



కుక్కునూరు: జ్వాలాతోరణం నిర్వహిస్తున్న దృశ్యం



జంగారెడ్డిగూడెం: శివలింగానికి అభిషేకం నిర్వహిస్తున్న భక్తులు



పోలవరం రూరల్: పట్టిసం రేవులో గోదావరి మాతకు హారతి ఇస్తున్న దృశ్యం

న్యాయమైన పరిహారం చెల్లించాలి

చింతలపూడి: ఎత్తిపోతల పథకం భూ నిర్వాసిత రైతులకు కొత్త నోటిఫికేషన్ ద్వారా పరిహారం చెల్లించాలని చింతలపూడి ఎత్తిపోతల పథకం భూ నిర్వాసిత రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం చింతలపూడిలో ఎత్తిపోతల పథకం భూ నిర్వాసిత రైతుల సమావేశం చిట్లూరి అంజిబాబు అధ్యక్షతన నిర్వహించారు. కె.శ్రీనివాస్ మాట్లాడుతూ 2015–16 భూసేకరణ నోటిఫికేషన్ ద్వారా తక్కువ పరిహారం రావడంతో అప్పటి నుంచి చింతలపూడి ఎత్తిపోతల పథకం భూ నిర్వాసిత రైతులు న్యాయమైన పరిహారం కోసం పోరాటం చేస్తున్నారని గుర్తు చేశారు.

జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

చింతలపూడి: జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి సి.మధుబాబు పిలుపునిచ్చారు. డిసెంబర్ 14 న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌లో క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, బ్యాంక్ రికవరి కేసులు, చెక్ బౌన్స్ కేసులు, బీఎస్ఎన్ఎల్ రికవరీ కేసులు, కుటుంబ తగాదా కేసులు , మనోవర్తి కేసులు , ప్రామిసరీ నోట్ కేసులు పరిష్కారం చేసుకోవచ్చునని తెలిపారు. సమాచారం కోసం దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌లను, కోర్టు సిబ్బందిని సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

పుస్తక పఠనంతోనే జ్ఞానం



ద్వారకాతిరుమల: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పుస్తక ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు



లింగపాలెం: గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా పుస్తక ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు



జంగారెడ్డిగూడెం: చదరంగం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కామవరపుకోట: పుస్తక పఠనం జ్ఞానాన్ని కలగజేస్తుందని శాఖా గ్రంథాలయ చైర్మన్ షేక్ ఇబ్రహీం అన్నారు. 57వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రంథ పాలకులు ఎం భీమరాజు, వీరమల్ల మధు, వీరంకి నాగరాజు, సిహెచ్ వెంకటరమణ, హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

చింతలపూడి: స్థానిక శాఖా గ్రంథాలయంలో శుక్రవారం పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. స్థానిక ఎస్సై కుటుంబరావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎస్.వర్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు రెండవ రోజు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో కేఆర్ కృష్ణప్రసాద్ రెండో రోజు కార్యక్రమాలను ప్రారంభించారు. గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎం.చంద్రశేఖర్ మాస్టర్, విద్యార్థులు పాల్గొన్నారు.

లింగపాలెం: ధర్మాజీగూడెం శాఖ గ్రంథాలయంలో 57 జాతీయ గ్రంథాలయాల వారోత్సవాల్లో భాగంగా ఈరోజు పుస్తక ప్రదర్శన, డ్రగ్స్ పై అవగాహన, పుస్తక పఠన ప్రాముఖ్యత కార్యక్రమాలు నిర్వహించారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రంథాలయ అధికారి సీహెచ్‌వీ రమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల: గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక శాఖా గ్రంథాలయంలో శుక్రవారం పుస్తక ప్రదర్శనను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు అన్ని రకాల పుస్తకాలను సందర్శించారు. కార్యక్రమంలో సచివాలయ మహిళా పోలీస్ లక్ష్మీ సుజన, గ్రంథాలయ సహాయకురాలు బట్టు మణి, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు శుక్రవారం రూ.1,35,630 విరాళంగా అందజేశారు. గుంటూరుకు చెందిన గంజి వెంకటేశ్వర్లు ముందుగా కుటుంబ సభ్యులతో కలిసి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేయగా, దాతకు దేవస్థానం సూపరింటెండెంట్ పద్మావతి విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

నాటు సారా తయారీ స్థావరంపై దాడి



బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న అధికారులు

బుట్టాయగూడెం: మండలంలోని కామయ్యపాలెం శివారు అటవీ ప్రాంతంలో నాటు సారా తయారీ కేంద్రంపై ఎక్సైజ్ శాఖ అధికారులు శుక్రవారం దాడి చేశారు. ఈ దాడిలో సుమారు 700 లీటర్ల నాటు సారా తయారి బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

చెట్టును ఢీ కొని కారు బోల్తా

ద్వారకాతిరుమల: చెట్టును ఢీ కొట్టి కారు బోల్తా పడిన ఘటనలో ఒక మహిళకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ప్రమాదం ద్వారకాతిరుమల శివారు వేపాలమ్మ ఆలయ సమీపంలో శుక్రవారం జరిగింది. మండలంలోని తిమ్మాపురానికి చెందిన ఒక మహిళ ద్వారకాతిరుమల నుంచి కామవరపుకోట వైపుకు వెళుతుంది. ఘటనా స్థలం వద్దకు వచ్చే సరికి సెల్‌ఫోన్ మాట్లాడుతూ కారు నడుపుతున్న ఆ మహిళ రోడ్డు పక్కన పడి ఉన్న చెట్టును ఢీ కొట్టింది. స్వల్ప గాయాలు పాలైన మహిళను స్థానికులు హుటాహుటిన పీహెచ్‌సీకి తరలించారు.

108 కలశాలతో అయ్యప్పకు పూజలు

చింతలపూడి: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని స్థానిక హరిహర సుత అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్ప భక్తులు 108 కలశాలతో శుక్రవారం పూజలు నిర్వహించారు. స్థానిక మారుతీనగర్ అయ్యప్ప స్వామి దేవాలయం నుండి పాత బస్టాండ్ సెంటర్, బోసుబొమ్మ సెంటర్, గాంధీ సెంటర్, ఫైర్ స్టేషన్ సెంటర్ మీదుగా కొత్త బస్టాండ్ వరకు ఊరేగింపు నిర్వహించారు.

ఎక్సైజ్ స్టేషన్ తనిఖీ

జంగారెడ్డిగూడెం: ఎక్సైజ్ సర్కిల్ స్టేషన్‌ను శుక్రవారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమీషనర్ కేవీ నాగ ప్రభుకుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం నాగ ప్రభుకుమార్ మాట్లాడతూ సర్కిల్ పరిధిలో బెల్టుషాపుల నిర్వహణ, ఎడీపీ మద్యం, నాటు సారా వంటి విక్రయాలు, రవాణాపై నిఘా ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

పోలవరం రూరల్: గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ అధికారి కె.రాంబాబు మాట్లాడుతూ ధాన్యం అమ్ముకునే రైతులు వారికి నచ్చిన మిల్లుకు ధాన్యం విక్రయించుకోవచ్చన్నారు.